అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



రాములు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు అయోధ్య రాములు మృతి అతని కుటుంబానికే కాదు.. పార్టీకి తీరని లోటని, ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని, అధైర్యపడొద్దని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన అంబర్‌పేట డివిజన్ బీజేపీ సీనియర్ నాయకుడు అయోధ్యరాములు కుటుంబాన్ని ఆయన నివాసానికి వెళ్లి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తు చేశారు. అయోధ్యరాములు కుటుంబానికి తాను, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన హామీనిచ్చారు. బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డా.గౌతమ్‌రావు, పార్టీ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్, పార్టీ నేతలు నాగభూషణంచారి, రాజు, వెంకటస్వామిగౌడ్, రాంచందర్‌గుప్తా, భిక్షపతి, యశ్వంత్, జయకుమార్, నవీన్‌రెడ్డి, శ్రీకాంత్, దయాకర్‌యాదవ్, పెంటం రాజు, కృష్ణముదిరాజ్, తిరుపతిగుప్తా, భాస్కర్ గౌడ్, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పింఛన్‌దారులు హక్కులను కాపాడుకోవాలి: సుధాకర్

చిక్కడపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారులంతా ఐక్యంగా ఉంటూ హక్కులను కాపాడుకోవాలని ఆలిండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి సుధాకర్ అన్నారు. అసోసియేషన్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయగానసభలో పెన్షనర్ల మానసిక వేదనపై సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టం పెన్షన్‌దారులకు ప్రమాదకర సంకేతాన్నిస్తుందన్నారు. పార్లమెంటులో చేసిన చట్టం రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందన్నారు. పెన్షనర్ల రూల్స్‌ను సవరించాల్సిన అవసరం ఏముందని ఆయన కేంద్రాన్ని ప్రశ్నించారు. బచ్చిరాజు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో నేతలు నళిని మోహన్‌కుమార్, పూర్ణచందర్‌రావు, రాజేంద్రబాబు, జనార్ధన్‌రావు, అనురాధ, చెన్నారెడ్డి, మస్తాన్‌వలీ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ నర్సుకు జనసేన వీరమహిళ సాయం

● రోడ్డు ప్రమాదంలో గాయపడి అచేతన స్థితిలో.. హైదరాబాద్ యువతి

● అండగా నిలిచి.. స్వదేశానికి పంపిన విశాఖ వాసి ఉష

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): ఆమె ఓ తెలుగు నర్సు. గల్ఫ్‌లోని బిషా అనే ఎడారి ప్రాంతంలో సేవలందిస్తోంది. కొంతకాలం క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. అయితే రియాద్‌లో ఉంటున్న జనసేన పార్టీ ఓ వీర మహిళ అండగా ఉండి బాధితురాలిని సోమవారం స్వదేశానికి పంపించింది. వివరాలివీ.. సౌదీ అరేబియాలోని బిషా అనే ఎడారి ప్రాంతంలో ఉన్న ఓ ఆస్పత్రిలో నర్సుగా హైదరాబాద్‌కు చెందిన 34 ఏళ్ల యువతి పనిచేస్తోంది. కొద్ది కాలం క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా మెరుగైన వైద్య సదుపాయం అందించినా.. ఆమె ఇంకా పూర్తిగా కోలుకోలేదు. ఆమె దయనీయ పరిస్థితిని తెలుసుకుని రియాద్‌లో ఉంటున్న విశాఖపట్నానికి చెందిన చెందిన జనసేన పార్టీ వీరమహిళ, సామాజిక కార్యకర్త దుగ్గారపు ఉష చలించిపోయారు. రియాద్ నుంచి 800 కిలోమీటర్ల దూరంలోని బిషాకు లోకల్ ఫ్లైట్‌లో వెళ్లి, బాధితురాలిని మరో 700 కిలోమీటర్ల దూరంలోని జెద్దాకు ఫ్లైట్‌లో తరలించారు. అక్కడి నుంచి అంతర్జాతీయ విమానంలో ఇండియాకు పంపించి, తిరిగి రియాద్‌కు చేరుకున్నారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ స్ఫూర్తితో సేవలో తనకు అలసట కనిపించదని ఉష ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. బాధితురాలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ

చిక్కడపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా సత్యనారాయణను నియమిస్తున్నట్టు జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్‌లో రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి చైర్మన్ జనక్ ప్రసాద్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని సత్యనారాయణ పేర్కొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి: అంతయ్య

చిక్కడపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెరల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్టు వైస్ చైర్మన్ అంతయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం చిక్కడపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వడ్డెరలు సుమారు 15 లక్షల మంది ఉన్నారని, వారంతా అన్ని రంగాల్లో వెనుకడి ఉన్నారని అన్నారు. వడ్డెర కులాన్ని బీసీ- ఏలో చేర్చి తీవ్రమైన అన్యాయం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అంతయ్య ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో డైరెక్టర్ కృష్ణయ్య, సాయి, పెంటేష్, వెంకటేశ్వర్, అనంతరావు, మోహన్‌కుమార్, శ్రీశైలం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ముందుకు సాగాలి

● కాచిగూడ సీఐ జ్యోత్స్న



మాట్లాడుతున్న కాచిగూడ సీఐ తల్లోజు జ్యోత్స్న

నల్లకుంట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు తమ హక్కుల సాధన కోసం ముందడుగు వేయాల్సిన అవసరం ఉందని కాచిగూడ సీఐ తల్లోజు జ్యోత్స్న అన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, ఇతరత్ర సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి వాటి పరిష్కారం కోసం ఆయా శాఖల ఉన్నతాధికారులను సంప్రదించాలని ఆమె సూచించారు. తద్వారా ఆ వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. నల్లకుంట డివిజన్‌లోని సత్యానగర్ కమ్యూనిటీహాల్‌లో ఎస్సీ, ఎస్టీల పౌర హక్కుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీఐ జ్యోత్స్న, నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత, హిమాయత్‌నగర్ డిప్యూటీ తహసీల్దార్ మనోజ్‌కుమార్, ఎస్ఐ సుభాష్, జలమండలి మేనేజర్ వెంకటేష్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అహ్మద్, సీనియర్ న్యాయవాది మహేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, బస్తీలో నివసిస్తున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, వృద్ధుల పెన్షన్, స్థానికంగా నెలకొన్న మంచినీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, ఇతరత్ర సమస్యలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయపరమైన చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రాజేష్, రాజేశ్వరరావు, క్రాంతికుమార్, శ్రీకాంత్, భిక్షపతి, జగదీశ్ పాల్గొన్నారు.

నర్సింహాబస్తీలో..

నల్లకుంట డివిజన్‌లోని నర్సింహాబస్తీ కమ్యూనిటీహాల్‌లో సోమవారం ఎస్సీ, ఎస్టీ పౌర హక్కుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని అధికారులకు బస్తీ వాసులు వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ బలరాం, ఎస్ఐ లక్ష్మీనారాయణ, సివిల్ సప్లయ్ అసిస్టెంట్ అధికారి రేష్మ, ట్రాన్స్‌కో ఏఈ నాగరాజు, జలమండలి ఏఈ రోహిత్, నర్సింహాబస్తీ కమిటీ అధ్యక్షుడు భూపతినాథ్, కార్యదర్శి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు మహేందర్, బాబు, ప్రేమ్, లక్ష్మణ్, సత్యనారాయణ, రమేష్, ప్రభురాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి: ఎంపీ అనిల్



యాదగిరిగౌడ్‌ను సన్మానిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్

చిక్కడపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ పార్టీ కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా సెక్రటరీ జనరల్ బంటారం యాదగిరిగౌడ్‌ను ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ అనిల్ మాట్లాడారు. పేదప్రజల సంక్షేమమే ధ్యేయంగా రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. ఆరు గ్యారెంటీల అమలుకు ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తోందని ఎంపీ అన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తప్పక కాంగ్రెస్‌లో గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ నాయకులు ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అబిషేక్‌కెన్నడీ, జయేందర్‌బాబు పాల్గొన్నారు.

స్వేచ్ఛ కుటుంబ సభ్యులపై వేధింపులు ఆపాలి

● మీడియాతో కలెక్టివ్ ఆఫ్ విమెన్ జర్నలిస్ట్స్

పంజాగుట్ట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన టీవీ యాంకర్ స్వేచ్ఛ కుటుంబ సభ్యులపై వేధింపులు ఆపాలని, నిందితుడిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టివ్ ఆఫ్ ఉమెన్ జర్నలిస్ట్స్ డిమాండ్ చేశారు. స్వేచ్ఛ మైనర్ కుమార్తెను చూపించే వీడియోలు, థంబ్‌నెయిల్‌లను వెంటనే తొలగించాలని కోరారు. కేసు దర్యాప్తు చేసే పోలీస్ అధికారులే లీకేజీలు ఇస్తున్నారని, ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళా జర్నలిస్టులు సి.వనజ, కట్ట కవిత, వైకృష్ణ జ్యోతి, సలీమా, రాజేశ్వరి, పద్మ, భూమిక సత్యవతి తదితరులు మాట్లాడారు.

పూర్ణచందర్‌ను కస్టడీకి ఇవ్వాలని పిటిషన్

చిక్కడపల్లి: యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో అరెస్ట్ అయిన నిందితుడు పూర్ణచందర్‌ను ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ చిక్కడపల్లి పోలీసులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

బీసీల ద్రోహి బీజేపీ: బాలరాజుగౌడ్

రాంనగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బీసీల ద్రోహి అని, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్‌రావును ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు బీసీ సంఘాల నేతలు పేర్కొన్నారు. చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. బీజేపీ బీసీలను అవమానించిందని, బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు. బీసీలకు ద్రోహం చేస్తే బీజేపీకి పుట్టగతులు ఉండవని బాలరాజు అన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ వెంకన్నగౌడ్, బీసీ సమైక్య అధ్యక్షుడు దుర్గయ్యగౌడ్, బీసీ సంఘాల నాయకులు శేఖర్, నాగేశ్వర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ విగ్రహ దిమ్మెను పునర్నిర్మించాలి

ముషీరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరాపార్కులో గల మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ విగ్రహ దిమ్మె పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, వెంటనే దాన్ని పునర్నిర్మించాలని మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకుడు వీడీ కృష్ణ తదితరులు ఉన్నారు.

రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ఉద్యోగ విరమణ



జీఎం అరుణ్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న దక్షిణ మధ్యరైల్వే ఉన్నతాధికారులు

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా సుదీర్ఘకాలం పాటు పనిచేసిన అరుణ్ కుమార్‌జైన్ సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు ఉన్నతాధికారులు, ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి ఘనంగా వీడ్కోలు పలికారు. రైల్ నిలయంలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తన హయాంలో దక్షిణ మధ్య రైల్వే అనేక గొప్ప విజయాలు సాధించడానికి అవిశ్రాంతంగా కృషిచేసిన అధికారులు, ఉద్యోగులను ప్రశంసించారు. అంతకుముందు మౌలాలిలోని ఆర్‌పీఎఫ్ శిక్షణ కేంద్రంలో ఆయనకు గౌరవ, కృతజ్ఞతా చిహ్నంగా ప్రత్యేక వీడ్కోలు పరేడ్ నిర్వహించారు. సందీప్‌మాథుర్ ఇన్‌చార్జి జీఎంగా బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారని అధికారులు తెలిపారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

చిక్కడపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు సోమవారం అశోక్‌నగర్ క్రాస్‌రోడ్‌వద్ద స్కూల్ బస్సులు, వ్యాన్లు, ఆటోల డ్రైవర్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి స్కూల్ ఆటో నడుపుతున్న వ్యక్తిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. రెండు ఆటోలలో పరిమితికి మించి స్కూల్ పిల్లలను తీసుకెళ్తున్న డ్రైవర్లపై కూడా కేసులు నమోదు చేసినట్టు చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం తెలిపారు. ఆటోలో పరిమితి మించి ఎక్కించుకున్న, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించకున్నా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐలు యాదగిరి, సాయిరాం, సుందర్‌రాజ్ ఉన్నారు.

నిరుద్యోగుల సమస్యను పరిష్కరించాలి

● సోషల్ డెమొక్రటిక్ జేఏసీ చైర్మన్ జనార్ధన్



వంశీకృష్ణకు నియామక పత్రం అందజేస్తున్న జనార్ధన్

బర్కత్‌పుర, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని సోషల్ డెమొక్రటిక్ జేఏసీ చైర్మన్ కోల జనార్ధన్ డిమాండ్ చేశారు. హైకోర్టు న్యాయవాది, మాజీ ఏజీపీ జక్కుల వంశీ కృష్ణ జాతీయ నిరుద్యోగ జేఏసీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కాచిగూడలో ఆయనకు జనార్ధన్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. అనంతరం జనార్ధన్ మాట్లాడుతూ నిరుద్యోగులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ ఖాళీలను పూర్తిగా విస్మరించారని అన్నారు. జూలై 3వ వారంలో మహిళల హక్కులను సాధించుకోవడానికి ఛలో ఢిల్లీ పేరుతో పార్లమెంట్‌ను ముట్టడిస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, గౌడ ఐక్యవేదిక చైర్మన్ అంబాల నారాయణగౌడ్, బోయ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గోపి, ఉదయ్‌నేత తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

● గాంధీనగర్ ఏసీపీ యాదగిరి



ఏసీపీ యాదగిరిని సన్మానిస్తున్న గోరక్‌నాథ్

ముషీరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బోనాల ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని గాంధీనగర్ ఏసీపీ యాదగిరి సూచించారు. గాంధీనగర్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన యాదగిరిని సోమవారం ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూస గోరక్‌నాథ్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలు బోనాల పండుగను ఐక్యంగా జరుపుకుంటూ మత సామరస్యాన్ని కాపాడాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఏసీపీ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోశ్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మాలబస్తీలో నూతన విద్యుత్ పోల్ ఏర్పాటు

చిక్కడపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని మాలబస్తీలో డివిజన్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ చొరవతో విద్యుత్ సిబ్బంది నూతన కరెంట్ పోల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఎలక్ట్రికల్ ఇన్‌చార్జి ఏఈ సంతోశ్ పనులను పర్యవేక్షించారు.

ఇద్దరి దొంగల రిమాండ్

బర్కత్‌పుర, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్‌ను బెదిరించి సెల్‌ఫోన్, నగదును లాక్కొని పారిపోయిన ఇద్దరు దొంగలను కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ మారేడుపల్లికి చెందిన రాఘవేంద్రస్వామి అలియాస్ రాహుల్, నామాలగుండుకు చెందిన శశాంక్ ఇద్దరు స్నేహితులు. ఈ నెల 26న జామి ఉస్మానియా రైల్వేస్టేషన్ వద్ద ఆటో డ్రైవర్ బానోతు సేవాలాల్‌ను బెదిరించి అతని వద్ద సెల్‌ఫోను, రూ.3వేల నగదును లాక్కొని పారిపోయారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ వద్ద ఈ ఇద్దరు దొంగలు అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకుని విచారించారు. చేసిన దొంగతనాన్ని ఇద్దరు ఒప్పుకున్నారు. విచారణ అనంతరం వీరిద్దరిని రైల్వేకోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు. వారి నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో రైలు ఢీకొని ఇద్దరు మృతి..

వేర్వేరు సంఘటనలో పట్టాలు దాటుతూ రైలు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్‌కు చెందిన బారుణ్ మండల్ స్థానిక గణేష్‌నగర్‌లో నివాసం ఉంటూ కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం బుద్వేల్ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మరో సంఘటనలో యాకుత్‌పురా - ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌ల నడుమ 42 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ రెండు సంఘటనలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

నృత్య కళలతో మానసిక వికాసం

● మధుసూదన్‌రావు

రాంనగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): భారతీయ నృత్యకళలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని దూరదర్శన్ పూర్వ సంచాలకులు మధుసూదన్‌రావు పేర్కొన్నారు. నల్లకుంట మెయిన్ రోడ్‌లోని శృంగేరీ శంకరమఠం సౌజన్యంతో శ్రీఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నృత్యకళల పరంపరగా కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. ముందుగా నృత్య గురువు విశాఖ ప్రకాష్ శిష్యులు లితిక, వేదశ్రీ, శ్రీహిత, కార్తీక, భావజ్ఞ, హరిత, గీతిక ప్రదర్శించిన గణపతి తాళం, శ్రీలలిత నక్షత్ర మాలిక, పుష్పాంజలి నటరాగం, అన్నమాచార్య కృతి ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. యువ కళావాహిని సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంగీత గురువు రత్నమాల, పాలపర్తి సంధ్యారాణి, బుర్ర మోహన్‌కృష్ణ, రఘుశ్రీ పాల్గొన్నారు.

శాంతి చర్చల కమిటీకి పార్టీలతో సంబంధం లేదు: జస్టిస్ చంద్రకుమార్

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నక్సలైట్లు తక్షణమే హింసను ఆపేసి లొంగిపోవాలంటూ నిజామాబాద్ సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మళ్లీ పాత పాటే పాడారని శాంతిచర్చల కమిటీ అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్ ఆక్షేపించారు. చర్చలు జరపాలని మావోయిస్టులు సూచిస్తున్నా ప్రభుత్వమే స్పందించడం లేదని విమర్శించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ నక్సలైట్లతో ప్రభుత్వం చర్చలు జరపాలని సూచించారు. మావోయిస్టులు కాల్పుల విరమణను పాటిస్తామంటే హింసను వీడతామని చెప్పినట్లే కదా! అని తెలిపారు. చర్చలు లేకుండానే, లొంగిపోవాలనే ప్రభుత్వాల వైఖరిని మావోయిస్టు నాయకులు సమ్మతించలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం మానవత్వంతో ఆలోచించి మావోయిస్టు పార్టీతో చర్చల దిశగా అడుగులు వేయాలని డిమాండ్ చేశారు. నక్సలైట్లకు మద్దతు పలుకుతున్న వారు బాధిత కుటుంబాల పరిస్థితి గురించి కూడా ఆలోచించాలని అమిత్‌షా చేసిన హితవుపైనా చంద్రకుమార్ స్పందించారు. శాంతి చర్చల కమిటీకి ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధంలేదని స్పష్టం చేశారు. ఆదివాసీ ప్రాంతాలలో శాశ్వత శాంతి నెలకొనాలన్నదే ఉద్దేశమని తెలిపారు. భవిష్యత్తులో ప్రాణనష్టం తలెత్తకుండా ఉండడానికి శాంతి చర్చలమార్గమే ఏకైక పరిష్కారమని శాంతి చర్చల కమిటీ కార్యనిర్వాహకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్ సూచించారు.